# అంతరంగం పవిత్రమైనది

“ఒక నిమిషం ఉండండి, నేను పిలుస్తాను . . . మీరెవరు మాటాడుతున్నారు?” అనే ప్రశ్న వినగానే పళ్ళు కొరుకుతూ యువకుడు జవాబు చెప్పాడు: “నేను అతని కొడుకు వేణు.”

కొంచెం సేపు తరువాత అతని తండ్రి కంఠధ్వని టెలిఫోనులో మోగింది: “హలో, నేనే సుందరం . . . ”

అంతవరకూ వేణుని ఆవరించుకున్న ధైర్యం, ద్వేషం, తారుమారైపోయి అతని పెదిమలు, గుండె వొణికాయి; మాటలు సరిగ్గా పెగల్లేదు. కాని సర్దుకొని మాట్లాడాడు: “నేను వేణు మాటాడుతున్నాను . . . మీతో కొంచెం మాటాడాలి . . . ఒంటరిగా మాటాడాలి . . . ”

“సరేలే . . . ఇంకా కొంచెం సమయంలో నేను ఇంటికి వచ్చేస్తాను . . . ”

“లేదు . . . దాని గురించి ఇంట్లో మాట్లాడడానికి నాకిష్టం లేదు . . . మీరు గాని అక్కడే ఉన్నారంటే నేను పది నివిషాలలో వచ్చి మిమ్మల్ని కలుసుకుంటాను . . . ”

“ Oh, I see! సరే, రా . . . ”

“Thanks . . . ”

రిసీవరుని కింద పెట్టిన తరువాత పొంగివస్తున్న చెమటని వేణు తుడుచుకున్నాడు; గుండె ఇంకా వొణుకుతూనే ఉంది; తను దేనిగురించో మాట్లాడాలని నిశ్చయం చేసుకొని. ఒక బ్రహ్మాండమైన పనికి సిద్ధమౌతున్న ధోరణిలో తన అఱచెయిలో ఒక గుద్దు ఇచ్చి తన రోషం తెలియజేసాడు:

‘హూం . . . ఇది నా బాధ్యత! ఈ కుటుంబం ప్రతిష్ట కాపాడడం నా బాధ్యత! ఒక పిల్లవాడు - తన కొడుకే - తన్ను - నిందించే ధోరణిలో తన ప్రవర్తన చెడిపోయిందని అతనికి తెలియవద్దూ? ఇది చాలా అవమానకరమైన సంగతే! కాని, నేను నా కోపం చూపించక, న్యాయం గురించి మాట్లాడి, అతని సిగ్గుచేటు అతనికే

బయటపెట్టాలి . . . 'అలాగేం కాదు, 'ఇదీ', 'అదీ' అని ఏదో చెప్పి అతను తప్పించుకోవాలని చూస్తారు, కాని అతని డ్రాయరులో ఉన్న ఆ ఉత్తరం - కర్మ!, కర్మ! - ప్రేమ లేఖ - నా చెయిలో ఉందే! 'నువ్వు దొంగతనంగా మారు తాళంచెవితో నా డ్రాయరు తెరిచావ్!' అని అతను అరుస్తారు! అతని దొంగచాటు ప్రేమ వ్యవహారం తెలియాలని నేను చేసినది పెద్ద పొరబాటు కాదు . . . నిన్నరాత్రి అతను దొంగతనంగా ఆమెతో రెండవ షో సినిమాకి వెళ్ళారని తెలిసింది; ఆ తరువాతే నేను అతని గదిని సోదా చెయ్యాలని నిశ్చయించాను . . . '

- వేణు తొందర తొందరగా దుస్తులు ధరించి బయలుదేరే సమయంలో Ladies Club కి బయలదేరుతున్న అతని తల్లి రమణియమ్మాళ్ ఎదుట కనిపించింది.

కొన్ని రోజులుగానే వేణు ప్రవర్తన, సంభాషణ ఒకలాగ ఉన్నాయని ఆ మాతృ హృదయం గ్రహించింది.

ఇప్పుడు గభీమని వాడిని చూడగానే వాడి ఆకృతి చూసి ఆమె కలవరపడింది.

'వీడేం సరిగ్గా భోంచేస్తున్నడా, నిద్రపోతున్నాడా? " అనే అనుమానం ఆయాసకరమైన వేణు మొహం చూడగానే ఆమెకు కలిగింది; వాడు బాగా చిక్కిపోయాడు, నల్లబాటిపోయాడు. క్షవరం చేసుకోలేదు, అందువలన రోమం కూడా దట్టంగా పెరిగిపోయింది. ఏ కారణం వలనో వాడు మనోవ్యధతో బాధపడుతున్నాడని ఆవిడ తెలుసుకుంది.

'వాడిప్పుడు యువకుడు; వేణుకి ఏమైనా అంతరంగ ప్రశ్నలు ఉండవచ్చు. అందులో నేను జొరపడడం అనాగరికం' అనే అవగాహనతో ఆమె అతన్ని చేరుకుంది.

"ఏమిట్రా వేణు . . . ఎక్కడ బయలుదేరావ్?" అని ముద్దుగా వాడి భుజం తాకింది; వాడికి చిరాకు కలిగింది.

"కొంచెం పని ఉంది . . . " అని మోటుగా జవాబు చెప్పాడు.

"What's wrong with you? Whatever it is, can I help you?"

"Thanks . . . " అని చెప్పి, తొందరగా ఆమెను దాటి వెళ్తున్న వేణుని తల్లి ఆపింది.

“వెళ్ళు . . . లోపలికి వెళ్ళు . . . వంటగదిలో అవ్వ special గా ఏదో sweet చేసిందట . . . అదేదో నువ్వూ taste చెయ్ . . . ” అని ఉపచారం చేసి, తనకీ ఆలస్యం అవుతుందని వాచీని చూసి తెలుసుకొని ఆమె నిష్క్రమించింది.

వేణు ఒక నిమిషం తల వొంచి ఆలోచించాడు.

‘ఈ అమ్మ ఒక జడ్డి; నాన్నగారు ఎంత హుషారుగా ఆమెను మోసం చేస్తున్నారు!’ అని వేణుకి అర్థమైంది. అంతేకాక, ఈ వయస్సులోనూ తల్లి చేసుకునే అలంకారం - నగలు, మొహం నిండా ఒత్తుకున్న పౌడరు, పెదిమలకి రంగు, ఆ పొడుగాటి జాకెట్టు; కీచు స్వరంలో ఆమె పలికే ఇంగ్లీషు మాటలు - ఇవన్నీ వాడిని రెచ్చగొట్టాయి.

అప్పుడే convent నుంచి తిరిగి వచ్చిన అతని ఇద్దరు సహోదరులు, ఆరేళ్ళ చెల్లెలు సోఫాలో కూర్చొని జోడులు, వాచీలు తీస్తున్నారు. వాళ్ళని చూడగానే వేణు గుండెలో జాలీ, దుఃఖమూ, లేచాయి.

‘పూచిలేని తల్లి, పాపిష్టియైన తండ్రి ఈ పిల్లల భవిష్యత్తుని ధ్వంసం చేస్తారు’ అనే ఆలోచన రాగానే . . . ‘ఇక నేను చేసేదేముంది?’ అని వేణు కలవరపడ్డాడు.

‘తప్పకుండా నేను ఏమైనా చేసి తీరాలి! అది నా బాధ్యత! నేనేం పిల్లవాడినా? నాకిప్పుడు 21 నిండాయి . . . Legally, I am an adult!’

చివాలున వేణుకి తన్ను పెంచిన తాత, నాయనమ్మ జ్ఞాపకంలో వచ్చారు.

‘మంచివేళ! నేను ఈ చెడు వాతావణంలో పెరగలేదు . . . ’

** ** **

వేణు తండ్రి సుందరం, తల్లి రమణి ఇరవై ఐదు సంవత్సరాలముందు కాలేజీలో చదువుతున్న రోజుల్లో ప్రేమించి పెళ్ళిచేసుకున్నారు. ఇద్దరూ వేరే వేరే జాతికి చెందినవారు కాబట్టి సుందరం తన తల్లిదండ్రులని విరోధించుకొని రమణిని పెళ్ళాడారు.

రమణీ అమ్మాళ్ బాల్యంలోనే convent లో చదివి ఆంగ్లేయుల ధోరణిలో పెరిగింది. ఆమె కుటుంబం పుష్కళంగా పాశ్చాత్య నాగరకతలో పెరిగింది. ఆ రోజుల్లో సుందరంకి ఆమెపట్ల కలిగిన ఆసక్తికి అదే కారణం అనవచ్చు.

ఆ అభిరుచి వలన తల్లిదండ్రులని మలుపుకొని సుందరం కులాంతర వివాహం చేసుకున్నారు. ఆ తరువాత రెండు సంవత్సరాలు తల్లిదండ్రులతో సుందరంకి ఎటువంటి సంపర్కమూ లేదు; రెండు సంవత్సరాల తరువాత వేణు పుట్టాడు.

పుత్ర వాత్సల్యం త్యజించి కాలం గడుపుతున్న సుందరం తండ్రి గణపతియా పిళ్ళై, అతని భార్య విశాలం మనవడిని చూడడానికి గ్రామంనుంచి రైలెక్కి, పట్ణంకి పరుగెత్తుకొని వచ్చారు. క్రమేణ విరోధభావం తగ్గుతూ వచ్చింది. సుందరం, అతని తల్లిదండ్రుల మధ్య బంధుత్వంకి వారధిగా వేణు మెలిగాడు.

వేణుకి ఆరేళ్ళు నిండగానే గణపతియా పిళ్ళై మనవడుని తన సంరక్షణలో పెంచుతానన్నారు. "ఎవరో కులాంతర స్త్రీకి మా ఆచారంకి తగినట్టుగా పెంచిన మా అబ్బాయిని పోగొట్టుకున్నాం!" అని పరితపించే గణపతియా పిళ్ళై, పాపనివృత్తికి మనవడుని దత్తు చేసుకున్నారు. వేణు తాతగారి ఇంటిలోనే పెరిగాడు, చదువుతున్నాడు. తల్లిదండ్రుల ఇల్లు అనేది తను ఎప్పుడైనా శెలవులు గడిపే జాగాలాగ వాడికనిపించింది.

సుందరం తండ్రి గణపతియా పిళ్ళై వీర శైవులు, తమిళ భాషలో పండితులు. గొప్ప శివ భక్తులు. అతని భార్య విశాలం గత నూరేళ్ళ స్త్రీ వాదంకి ఆఖరి ప్రతినిధి; భర్త ఎదుట కూర్చోడం, మాటాడం - ఇవన్నీ ఆవిడకి నిషేధం.

వేణు ఎప్పుడైనా శెలవులకి తల్లిదండ్రులని చూడడానికి వచ్చినప్పుడు వాళ్ళ జీవిత శైలి, దుస్తులు ఒక విదేశీయ ధోరణిలో వాడికి కనిపించాయి. ఆ ఇంటిలో వేణు తన్నొక పరాయి మనిషిగా ఎంచుకున్నాడు. బాల్యంలో ఆ అనుభవం గురించి తాతగారికీ, నాయనమ్మకీ వివరించి, నవ్వుతూ, వెక్కిరింతగా మాటాడేవాడు. ఆ తరువాత, తన తాత, నాయనమ్మతో, తన తల్లిదండ్రులని సరిపోల్చుకున్నాడు. అతని మనసులో అతని తాత, నాయనమ్మ ఆదర్శ దంపతులుగా, మన భారతీయ సంప్రదాయంకి సముచితంగా, కనిపించారు.

ఎంత ప్రేమ, అభిమానం ఉన్నా వేణుకి తన తల్లిదండ్రులపై గౌరవం కలగలేదు.

వేణు హైస్కూల్ చదువు ముగించుకొని, సమీపంలో ఉన్న చిదంబరం నగరంలో కాలేజీలో చేరాడు. అతని చదువు ఎంత ఆధునికమైనా, అతని జీవిత శైలి ఎటువంటి నవీనతకి గురి అవలేదు.

ఇప్పుడు కాలేజీ చదువు ముగించుకొని వేణు చెన్నైకి వచ్చి కొన్ని నెలలే అయ్యాయి.

వాడికి తాతగారిని, నాయనమ్మని వదిలి రావడానికి రవంతైనా ఇష్టం లేదు.

"నేనేం ఉద్యోగం చెయ్యనక్కరలేదు . . . చదువుకున్నవాళ్ళందరూ నగరాలకి వెళ్ళడంవలనే మన దేశం ఇలాగుంది . . . నేనిక్కడే ఉండి వ్యవసాయం చూసుకుంటాను" అని వేణు తాతగారికి పదే పదే చెప్పాడు; నాయనమ్మకీ ఆ ఆలోచన నచ్చింది.

కాని చాలా సేపు కళ్ళు మూసుకొని ఏటవాలు కుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్న తాతగారు భార్యకి చెప్పారు: "నీకేం మతి పోయిందా, వాడితో కలిసి నువ్వూ మాటాడుతున్నావ్? మన అబ్బాయిని వదిలి ఉన్నప్పుడు మనకెలా అనిపించింది? ఇప్పుడు అలాగేకదా వాడి తల్లిదండ్రులకి ఉంటుంది? చదువుకని ఇన్నిరోజులూ వేణు మనతో ఉన్నాడు; మరిప్పుడు కన్నవాళ్ళ అబ్బాయిగా వాడు అక్కడకి వెళ్ళి ఉండడమే న్యాయం."

"నేనక్కడకి రాలేదని ఎవరూ ఏడవడం లేదు!" అని వేణు జోక్యం చేసుకున్నాడు.

"వేణు! నువ్వు మాతో ఉంటే నీ కంటే మాకే ఎక్కువ సంతోషం అని నేను వేరే చెప్పాలా? ఇప్పుడు కొన్నిరోజులు అక్కడకి వెళ్ళు, తరువాత ఏం జరుగుతుందో చూద్దాం . . . నేనిలాగ మాటాడుతున్నాను, కాని నువ్వు రైలెక్కి వెళ్ళిన తరువాత మేమెలా రోజులు గడుపుతామో? దానికేం? . . . నువ్వు శెలవులకి వెళ్తున్నట్టు అక్కడ కొన్నిరోజులు ఉండు . . . ఏమంటావ్, సరేనా?" అని అతను నొక్కి చెప్పిన తరువాత వేణు చెన్నైకి రావడానికి సమ్మతించాడు.

ఇంతకు ముందు శెలవులకి వచ్చి వేణు నెలలు తరబడి తల్లిదండ్రులతో ఉన్నప్పుడు ఏర్పడని విసుగు ఇప్పుడు రెండు వారాల్లో వచ్చేసింది; వాడికేదీ నచ్చలేదు.

తన తల్లిదండ్రులు డైనింగ్ టేబుల్లో కూర్చొని భోంచెయ్యడం; పొద్దున్న ఎనిమిది గంటలవరకూ తన తండ్రి నిద్రపోవడం; అతను పరుగెత్తుకొని వచ్చి తత్క్షణమే తల్లికి సేవ చెయ్యడం - ఇవన్నీ చూసి వేణుకి జుగుప్స కలిగింది.

అతని మనసులో అరవై సంవత్సరాలు నిండిన వయస్సులో ప్రొద్దున్నే లేచి, స్నానం చేసి, పసుపు, కుంకుమంతో వికసిల్లే నాయనమ్మ మొహం తరచుగా లేచింది; ఆవిడ ఈ వయస్సులోనూ తాతయ్యకి సేవ చేసే మహత్వం గుర్తుచేసుకొని, ఆ జ్ఞాపకంలో వచ్చిన ప్రతీ ఘటనలోనూ వేణు తన తల్లిదండ్రుల ప్రవర్తన పరిశీలించి చూసాడు.

'ఈ నాన్న పెళ్ళాంకి మంచి దాసుడు!' అని వాడికనిపించింది. 'ఈ అమ్మ ఇష్టం వచ్చినప్పుడు సినిమాకి. Ladies Club కి వెళ్తోంది, ఆమెను ఎవరూ ఏమీ అడగరు. అలాగే నాన్నగారు గురించి ఆవిడకి ఏ చింతా లేదు! ఛీ, ఇదేం సంసారం!' అని వేణు విసుగ్గున్నాడు.

'సరేలే, మనకేం పోయింది, తాతగారి మాట విని ఇక్కడకి వచ్చాం, కొన్నిరోజులుండి గ్రామంకి తిరుగు ప్రయాణం' అని ఉంటున్న వేణు మనసులో ఇంకా తీవ్రంగా కోపం, జుగుప్స కలుగజేసే ఘటన కిందటి వారం జరిగింది.

రాత్రి ఎనిమిది గంటలు; టెలిఫోనులో ఎవరో పిలిచారు. అప్పుడు సుందరం మేడమీదున్నారు; వేణు రిసీవరు తీసుకున్నాడు.

"హలో?" టెలిఫోను నంబరు చెప్పాడు.

"నేనే, వత్సలా మాటాడుతున్నాను . . . కాలేజీలో meet చెయ్యాలని వచ్చాను, మీరు అంతకు ముందే వెళ్ళిపోయారు . . . ఇవాళ Sound of Music ఆఖరి రోజని అంటున్నారు . . . ఇవాళ night show వెళ్దామా? . . . ఏం, ఏమీ మాటాడరేం?"

వేణుకి అంతా అయోమయంగా ఉంది. ఆరంభంలో 'ఇదొక wrong number!' అనే అనుమానం కలిగినా, 'కాలేజీలో meet . . . ' అన్న మాటలు వినగానే అది త్వరలో మాయమైపోయింది! మరేం తోచక రిసీవరుని టెలిఫోనుమీద పెట్టేసి వేణు ఆ గదినుంచి పారిపోయాడు. ఏకాంతంగా ఇంకొక గదికి వచ్చి కూర్చున్నాడు; మనసులో చంచలం అలాగే ఉంది.

'నాన్నగారిని తప్పిస్తే వయసు వచ్చిన మగవాడు ఆ ఇంటిలో లేడనే ధైర్యంతో, మామూలుగా, ఒకావిడ పిలిచారు - అదే ఆ వత్సలా . . . ' అని వేణు దృఢంగా నమ్మాడు.

కొంచెం చేపట్లో మళ్ళీ టెలిఫోను మోగింది, మొగుతూనే ఉంది; వేణు తన జాగానుంచి కదల్లేదు.

మేడమీదనుంచి దిగివచ్చి సుందరం టెలిఫోను రిసీవరు తీసుకున్నారు.

"హలో?" అతను టెలిఫోను నంబరు చెప్పారు.

వేణు మెల్లగా లేచివచ్చి టెలిఫోను ఉన్న హాలుకీ, తను ఉన్న గదికీ మధ్య ఉన్న బల్లమీద చెవిని ఒత్తుకొని విన్నాడు. అవును, గూఢచారిలాగ పొంచియుండి విన్నాడు; అతని తండ్రి ఇంగ్లీషులోనో మాటాడుతున్నారు.

"లేదే . . . నేను మేడమీద ఉన్నాను . . . "

" . . . . "

" It's all right"

" . . . . "

"ఒక వేళ మా పెద్దబ్బాయేమో? . . . అవును, వాడు ఊరులో ఉన్నాడు . . . ఇప్పుడే . . . అవును . . . "

" . . . . "

"మరెవరూ adults లేరే! . . . "

" . . . . "

"సరే . . . I can handle it . . . Okay . . . "

" . . . Nine-thirty . . . Is it okay?"

" . . . Don't worry!"

" . . . . "

"What are you talking?"

" . . . . "

" Good-bye . . ."

సంభాషణ సమాప్తమయే సమయంలో వేణు తన గది నుంచి మెల్లగా జారుకున్నాడు.

ఆ ఘటన తరువాత ఇవాళ వరకూ వేణు సుందరం మొహంలో పడలేదు; ఒకే ఇంటిలో ఉన్నా, చమత్కారంగా అతను తన్ను చూడకుండా తప్పించుకున్నాడు.

కొన్నిరోజులముందు ఇంటిలో ఎవరూ లేనప్పుడు వేణు మేడలో తన తండ్రి గదికి వెళ్ళాడు. అతని అనుమానం ఖాయపరచడానికి మరి కొన్ని నిదర్శనలు కావాలి.

మారు తాళంచెవితో తండ్రి మేజా, డ్రాయరు, అన్నీ వేణు తెరచి చూసాడు. ఒక దొంగలాగ ప్రవర్తించడంలో అతనికి అవమానం అనిపించలేదు. అంతకంటే గొప్ప అవమానం భరించడానికి అతనికి కొన్ని విషయాలు తెలిసిన తరువాత తను చేసిన పని న్యాయమే అని నమ్మకం కలిగింది.

'నాకెందుకు భయం? పొరబాటు చేస్తున్నది నాన్నగారు, నేను కాదు! అతనితో దీనిగురించి మాటాడి అతన్ని దిద్దాలి, అది నా బాధ్యత . . దీనిగురించి ఎలాగ అతనితో మాటాడడం? ఇంట్లో మాటాడితే అమ్మకి తెలిసిపోతుందే? ఇంటి బయట మరెక్కడైనా అతన్ని కలుసుకోవాలి . . . అతను గాని నా మాట వినకపోతే? దానిగురించి తరువాత ఆలోచిద్దాం! ముందు ధైర్యంగా అతన్ని ఎదుర్కోవాలి, హెచ్చరించాలి!" అని రాత్రి పగలు దీనిగురించి ఆలోచిస్తూ, బాధ పడుతూ, ఆఖరికి నిన్న వేణు ఒక నిర్ణయంకి వచ్చాడు:

"ఏమైనా సరే, రేపు దీనిగురించి అతనితో మాటాడి తీరాలి. నాకెందుకు భయం? నేనేం పిల్లవాడినా? I am now a adult!"

** ** **

సముద్రతీరంకి ఆనుకొని, ఇటీవల కొత్తగా వేసిన వీధిలో సుందరం తన మోరీస్ మైనర్ కారు నిలిపారు. అతని పక్కనే కూర్చున్న వేణు కారు తలుపు తెరచుకొని కిందకి దిగాడు. అతని చూపు దూరంలో కెరటాలమీద వాలింది. గాలిలో తన పంచెని సర్దుకొని, ముందుకు నడుస్తూ, ఇసుకమీద నిల్చున్నాడు. గత

పదినిమిషాలుగా అతని మనసు - నాన్నగారిని కాలేజీలో కలుసుకొని ఇక్కడ వచ్చిచేరినవరకూ - సంభాషణ ఎలా ఆరంభించాలని కలవరపడుతూ ఉంది. ఎంత పెద్ద పొరబాటు చేసివున్నా ఒక తండ్రితో అతని కొడుకు అతినీచంగా మాటాడకూడదనే హెచ్చరికతోబాటు, తనకి వచ్చే కోపంలో తను అమరిక కోల్పోవడం సాధ్యం అని భయమూ వేణుకి కలిగింది.

కారునుంచి దిగిన సుందరం తన కోటుని మడతబెట్టి సీటుమీద పడేసి, కిటికీలు పైకెత్తి, కారుని తాళం వేసి వచ్చారు.

వేణు పక్కన నిలబడి తన వాచీ చూసుకొని వాడి చెవులకి వినిపించినట్టు "ఐదు గంటలే అయింది!" అని అతను తనలో చెప్పుకున్నారు.

"అవును. అందువలనే గుంపుగా ఎవరూ కనిపించడం లేదు!" అని వేణు ఒక నకిలీ నవ్వు నవ్వాడు.

సముద్రతీరంలో ఇసుకమీద వెలుతురు ఇంకా అలాగే ఉంది.

ఇద్దరూ మౌనంగా ఇసుకమీద నడిచారు. చూసినవారికి ఆ ఇద్దరూ తండ్రి, కొడుకుగా కనిపించరు, ఒక గురువు, శిష్యుడులాగ ఉన్నారు. ఇద్దరి ముఖాల్లోనూ చాలా పోలికలున్నాయి. తండ్రికంటే ఎత్తుగా ఉన్నా అతనిలాగ కండ లేకపోవడం వలన వేణు స్వరూపం కొంచెం పల్చగా కనిపిస్తోంది.

తల వొంచి నడుస్తూ వేణు ఇసుకలో దృఢంగా పాతుకున్న తన పాదాలు చూసాడు.

అతని మనసులోని భారం పెరుగుతూనే ఉంది. కలవరంతోబాటు కోపం అతన్ని గభీమని ఉక్కిరిబిక్కిరి చేసేసింది; మొహం ఎఱ్ఱబారి పోయింది. వేణు పెదిమలు బిగించి, కఱచుకున్నాడు.

అతని చూపు దూరంలో ఆ కెరటాలమీద వాలినప్పుడు ఆతని కన్నుల చివర తేలుతున్న నీళ్ల బొట్లు గాలిలో కలిసిపోయి కనుబొమ్మలు బాగా తడిసిపోయాయి.

సుందరం అతన్ని అభిమానంతో చూసారు. ఒక సారి దగ్గారు; వేణు అతన్ని తిరిగి చూసినప్పుడు వాడిని శాంతపరచే విధంగా చిరునవ్వు నవ్వారు; వాడి పెదిమలు వొణికాయి.

“ఇక్కడ కూర్చుందామా?” అని సుందరం అడిగారు.

వాడేం జవాబు చెప్పకుండా కూర్చున్నాడు.

- ఎలా ఆరంభించడం?

వేణు అతని మొహం తేరిపారి చూస్తూ, ఆ తరువాత తల వొంచి ఆలోచిస్తూ, ఇసుకమీద గిలికుతూ కొంచెం సేపు గడిపాడు.

వాడు తనతో ఏకాంతంలో దేనిగురించి మాట్లాడడానికి వచ్చాడని సుందరం ఊహించగలిగారు. ఆ టెలిఫోను సంభాషణ తరువాత, ఒక వారం వరకూ, తను వేణుని చూడలేదనే ప్రజ్ఞ అతనికీ ఉంది. దాని వలన వేణుకి బాద కలిగిందని, ఒక యువకుడు అనే కారణం వలన వాడు సభ్యతతో తన్ను నిరాకరిస్తున్నాడని అతనికి అర్ధమైంది.

దానిగురించి వేణు తనతో మాట్లాడడానికి రావడం అతనికేం తృప్తిగా లేదు. కాని ఒక పిరికివాడులాగ ఆ ఘర్షణని తోసిపుచ్చకూడదు అని అతను ఇప్పుడు సిద్ధంగా ఉన్నారు.

కాని అతను తనే దానిగుంచి ఏమీ మాటాడలేదు.

వేణు తనలో తనే మాటాడుకున్నట్టు గొణుక్కున్నాడు; ఆంగ్ల భాషలో మాట్లాడాడు: “I am sorry . . . This is a shameful thing . . . ” ఆ తరువాత అతన్ని అడిగాడు: “నేను దేనిగురించి మాడాడుతున్నానని మీకు బోధపడిందా?”

అతను ఎటువంటి తడబాటు లేకుండా ‘బోధపడింది’ అని తలూపారు.

అతనిలో ఎటువంటి సంకోచం కనిపించకపోవడంతో వేణుకి ఆవేశం వచ్చేసింది.

“మీరిలాంటి మనిషి అని నేను నమ్మలేకున్నాను . . . ” వేణు ఉద్రేకంతో బిగువైన చేతులు పిసుక్కున్నాడు. గాలిలో జుత్తు గడ గడ వణకుతూంటే, మనసులో లేచిన భావనలు అణచుకొని ఒక నిట్టూర్పు వదిలాడు.

“Venu! Don’t be silly . . . నువ్వేం పిల్లవాడివా? . . . కొంచెం ఆలోచించు” అని సుందరం వాడి భుజంలో తట్టారు.

“Yes, Yes . . . I am an adult” అని వేణు పళ్లు కొరికాడు; ఆ తరువాత ఆంగ్ల భాషలోనే మాట్లాడాడు.

-ఒక విదేశీయ భాషలోనే ఒక తండ్రి, కొడుకు, మధ్య ఇలాంటి సంప్రదింపులు సాధ్యం అని వాడి అభిప్రాయం కాబోలు!

"ఆ టెలిఫోను ఘటన మీకు జ్ఞాపకం ఉందా? ఆ రోజునుంచి నేను మిమ్మల్ని చూస్తూనే ఉన్నాను . . . నా నాన్నగారు ఇలాంటి స్త్రీ లోలుడుగా ఉంటారని నేను కల్పనకూడా చెయ్యలేను! . . . ఇది మన కుటుంబంకి సంబంధించిన ప్రశ్న కదా? ఇది మీకూ, మీ వయస్సుకీ తగని ప్రవర్తన కాదా? ఈ అమ్మ ఉందే, అది ఒక జడ్డి! మీరు జీవితమంతా అమ్మని ఇలాగే మోసం చేస్తున్నారు!" ఇంతసేపూ వేణు మాటలు మౌనంగా వింటూ, సిగరెట్టు కాలుస్తున్న సుందరం, గభీమని ఇప్పుడు జోక్యం చేసుకున్నారు.

"Please! నీ అమ్మ గురించి ఏమీ మాటాడవద్దు! నువ్వు - నీకు ఇష్టం వచ్చినట్టు - ఎది చెప్పినా, సరే, నేను ఓపికతో వింటాను, కాని నీ అమ్మ గురించి ఏమీ అనవద్దు! నీకంటే నాకు దానిగురించి బాగా తెలుసు . . . నీకు నాగురించి ఏమిటి తెలుసో దానికంటే ఆమెకు నాగురించి తెలుసు . . . మేం ఇరవైఐదు సంవత్సరాలుగా కాపురం చేస్తున్నాం, ఆఖరివరకూ చేస్తాం . . . సరే, మరేం చెప్పాలో చెప్పు . . . నేను వింటాను . . . "

"మీరు అమ్మని మోసం చేస్తున్నారు . . . నాతో అదేం వీలుకాదు!"

సుందరం నవ్వారు: " నిన్ను మోసం చేసి నాకేంకావాలి?"

"ఆ టెలిఫోను ఘటన మాత్రం గుర్తు చేసుకొని నేను మీ గురించి మాటాడడం లేదు. మీరు రెండవసారి ఫోనులో మాటాడినప్పుడు ఆ సంభాషణ నేను విన్నాను. ఆ తరువాత రాత్రి తొమ్మిది గంటలకి కారులో వెళ్ళారుగా? . . . మీ ఇద్దరినీ నేను cinema theatre లో చూసాను . . . అందువలనే మీ గదిలో మీ మేజా డ్రాయరు, అన్నీ తెరచి చూసాను . . . మీ ప్రేమలేఖలు ఒక ఫైలులో చూసాను . . . అందులో ఇదొకటి!" అని కోపంతో తన జేబునుంచి ఒక కాగితం తీసి అతనిముందు విసిరాడు.

ఆ తరువాత వేణు మొహం వేరే దిశలో తిప్పుకున్నాడు. కళ్ళు తడిసిపోయి ఏడ్పు ఊపిరి ఆడకుండా చేసింది.

సముద్రతీరంలోని వీధుల్లో దీపాలు వెలగడం ఆరంభమైంది. బయట, ఇసుకలో, జనసమూహం బాగా పెరిగిపోయింది. కొందరు వీళ్ళ దిశలో వస్తున్నారు. వాళ్ళందరూ దాటి వెళ్ళినంతవరకూ ఇద్దరూ మౌనంగానే ఉన్నారు; ఆ తరువాత వేణు మాట్లాడాడు.

"మీరు నన్ను కన్న తండ్రి . . . మీకు ఇవన్నీ చెప్పడానికి నిర్బంధం వచ్చేసిందని నాకు బాధగా ఉంది. ఇకనైనా మీరు మీ పొరబాటు దిద్దుకోవాలి . . . అందుకే నేను చెప్తున్నాను . . . "

అంతకు మించి మరేం చెప్పాలో తెలియక వేణు మౌనం వహించాడు. సుందరం ఒక నిట్టూర్పు వదిలి తలెత్తి ఆకాశంని చూస్తున్నారు. వీడిదగ్గర దీనిగురించి తను ఏం మాట్లాడాలి అనే ప్రశ్నకంటే ఏమిటి మాట్లాడకూడదు అని అతను తీవ్రంగా ఆలోచించారు.

వేణు గభీమని అతన్ని అడిగాడు.

"తాతగారు నాకు చెప్పివున్నారు - మీరూ, అమ్మా ప్రేమించి పెళ్ళిచేసుకున్నారని . . . ఈ ప్రేమ వ్యవహారాలన్నీ ఆఖరికి ఇలాగే అవుతాయి కాబోలు?" అని నిందగా, హేళనగా, అడిగి అతని మొహం చూసాడు.

సుందరం సిగరెట్టు ఊదుతూ, కొంచెం తల వాల్చి, ఆలోచించారు. ఒక నిట్టూర్పు వదిలి, తలెత్తి, వేణుని చూసారు. దేనిగురించో వాడితో మాట్లాడాలని నిర్ణయించి, ఆఖరికి, 'వయసు వేరు అనుభవం వేరు; అలాగే అనుభవం వేరు, దానివలన వచ్చే వివేకం వేరు' అని గుర్తు చేసుకొని, తను చెప్పదలచుకున్నది వదిలి మరొకటి గురించి వాడిని అడిగారు.

"సరే, ఇప్పుడు నిన్ను బాధించే ప్రశ్న ఏమిటి? చెప్పు, వింటాను."

అతనిలాగ అడగ్గానే వేణుకి ఒక పక్క కోపమూ, ఇంకొక పక్క 'ఇతనెందుకు ఇలా ఐపోయారు!' అని జాలీ కలిగాయి; నవ్వుతూ ఆరంభించాడు:

"నాన్నగారూ, మీరొక ప్రొఫెసరు . . . గౌరవమైన కుటుంబంలో పుట్టినవారు; నలుగురు పిల్లలకి తండ్రి. ఈ వయసులో మీకు విటుడని తలవంపు వస్తే మీ

కుటుంబం పేరూ, ప్రతిష్ట, ఏమౌతుంది? దాని గురించి మీ అబ్బాయి బాధ పడడడం పొరబాటు అంటున్నారా? వాడికి అందులో సంబంధం లేదంటున్నారా?"

వేణు మాటాడుతున్నప్పుడు సుందరం వాడి మొహాన్ని సూటిగా చూసారు. వాడి మొహంని ఒక పక్క వెలుతురు, ఇంకొక పక్క అంధకారం ఆక్రమించుకొని ఉన్నాయి. కాని వాడి చూపు నాలుగు దిశలా చెదరిగొట్టినట్టు అతనికనిపించింది.

"వేణు, నువ్వు 'నేను adult!' అంటున్నావ్ . . . అది నిజం . . . కాని నీలో ఆ వయస్సుకి తగిన అమరిక కనిపించడం లేదే? . . . అసలు ఒక తండ్రిగా నా వ్యక్తిగత విషయాలు నేనెందుకు నీతో పంచుకోవాలి? నీకు నా సామాజిక అంతస్తు, కుటుంబం గురించి బాధగా ఉందని అంటున్నావ్ . . . మంచిది . . . కాని నా పేరూ, ప్రతిష్టకి ఏ భంగమూ రాదు! విను, వాటిని నిలబెట్టుకోడానికి నీకంటే నాకు ఎక్కువ ఆసక్తి ఉంది; అలా ఏమైనా నష్టం వస్తే అది నేను చూసుకుంటాను . . . ఆ నమ్మకం నాకు ఉందని నేను నీకెలాగ రుజువు చెయ్యాలి? ఎందుకు రుజువు చెయ్యాలి?"

సుందరం కంఠధ్వని పట్టుదలతో, బలంగా మ్రోగింది. అందులో ఏమాత్రం అలుక, అపరాధ భావం లేకుండా అతను తనతో మాట్లాడడం చూసి వేణుకి ఒక నిమిషం తనేదో పొరబాటు చేస్సున్నట్టు అనుమానం కలిగింది. కాని ఇంత వయసు మళ్ళిన ఒకతను ఒక అమ్మాయితో వ్యభిచార సంబంధం పెట్టుకొని ఇంత ధైర్యంగా తన దగ్గర మాటాడుతున్నారనే భావన రాగానే వాడికి కోపం ఇంకా ఎక్కువైంది.

" 'ఎందుకు రుజువు చెయ్యాలి?' అని అడుగుతున్నారా? నేను మీ భార్యకు పుట్టాను. మీరు ఆమెకు ద్రోహం చేస్తున్నారు!" అని వేణు పళ్ళు కొరికాడు.

"అది దీనిగురించి నన్ను అడగమని నీకు ఫిర్యాదు చేసిందా?"

"లేదు . . . "

"మరి నువ్వెందుకు హద్దు మీరి మా దాంపత్యంలో చొరబడుతున్నావ్?"

"I am your son! . . . అది నా బాధ్యత! . . . "

"No, son, no! నీకా బాధ్యత లేదు! My dear boy, ఇందులో జోక్యం చేసుకోడానికి నీకు అధికారం లేనే లేదు . . . "

వేణు పెదిమలు కొరుక్కున్నాడు; ఏడ్పు వచ్చేసింది. అతన్ని ఇష్టం వచ్చినట్టు తిట్టేసి, ఇక అతన్ని చూడకుండా, ఉన్న బంధం తెంచుకొని ఎక్కడైనా పారిపోదామా అని ఆలోచించాడు.

వేణు సంకటం, మనోవ్యధ చూసి సుందరంకి జాలి కలిగింది. తనకి సంబంధించని, తను భరింపలేని విషయాలని, లక్ష్యం చెయ్యకుండా, తోసిపుచ్చే త్రాణ లేకపోవడం వలనే ఆ పశి హృదయం ఇలాగ కలవరపడుతోందని అతను గ్రహించారు. అభిమానంతో వాడు చెయిని అందుకున్నారు.

"వేణు!"

పసిబిడ్డ చిరచిరలాడినట్టు వేణు అతని చెయిని వదల్చుకున్నాడు. ఇప్పుడు వాడికి ఏడ్పు నిజంగానే వచ్చేసింది. కాని దాన్ని ఆపుకొనే ప్రయత్నంలో అతన్ని అడిగాడు:

"నాన్నగారూ . . . నాకిది చాలా అవమానకరంగా ఉందే? . . . మీరెందుకు ఇలాంటి పనులు చేస్తున్నారు?"

అతను తనలో తనే నవ్వుకున్నారు.

"My dear boy! నువ్వు మీసం గిరగిరమని తిప్పుకుంటున్నావ్ . . . వయసు చెల్లిన యువకుడంటున్నావ్, మరెందుకు ఇలా నన్ను అడుగుతున్నావ్? నీ ఆవేశం నాకు బోధపడింది . . . నాగురించి నీకు చెడ్డ భావన ఉందంటే, దాన్ని మనసులో అలాగే ఉంచుకో . . . క్రమేణ ఎది సరి, ఎది తప్పు - ఎంతవరకు ఎది సరి, ఎది తప్పు - అని నీకు బోధపడుతుంది. నువ్వు చేసిన పనులన్నీ నీ మీదున్న అభిమానం వలన ఒక తండ్రిగా నేను క్షమించుతున్నాను . . . బాగా ఆలోచించు . . . నాన్నగారి వ్యక్తిగత విషయాలు తెలుసుకోవాలని అతని కొడుకే గూఢాచారిగా పని చెయ్యడం, దొంగతనంగా అతని అంతరంగంలో జొరపడడం ఎంత సిగ్గుచేటు! నేను ఇప్పుడు నీ పరిస్థితిలో ఉంటే దీనికోసం నా జీవితమంతా సిగ్గుతో బాధ పడతాను . . . "

అతను తన్ను క్షమించారని, తన పొరబాటుకి తను సిగ్గుపడాలని అతనన్న మాటలు వేణుకి అర్థం కాలేదు. కాని ఇక అతనితో మాట్లాడి అతని మనసు

మార్చడమో, అతను తన పొరబాటుని ఒప్పుకోవడమో అసాధ్యం అని వేణు గ్రహించాడు.

** ** **

"అమ్మా!"

ఆ దంపతుల సంతానంలో రమణిని అమ్మా అని, సుందరంని నాన్నగారని పిలిచేది వేణు మాత్రమే. తక్కిన పిల్లలకి వాళ్ళు Mummy, Daddyయే!

మేడమీద వరాండాకి వచ్చి నిలబడి వేణు "అమ్మా!" అని పిలిచినప్పుడు రమణీ అమ్మాళ్, నిదానంగా, ఏటవాలు కుర్చీలో, Julian Huxley రాసిన ఒక పుస్తకంలో ఒక పేరా ఉత్సాహంతో చదువుతోంది.

వేణు పుస్తకం అట్టని చురుగ్గా చూసి తనలో వల్లించుకున్నాడు: "Knowledge, Morality and Destiny."

"అమ్మా, నేను మిమ్మల్ని disturb చేస్తున్నానా . . . ?"

"ఛీ, ఛీ, ఎందుకీ formality? రా, రా . . . ఇలాగ కూర్చో . . . " అని రమణీ అమ్మాళ్ వాత్సల్యముతో పిలిచింది.

వేణు వరండాలో ఉన్న ఒక కుర్చీని లాగ్గొని, అందులో కూర్చున్నాడు.

వాడికి ఏం మాటాడాలని అర్థం కాలేదు. రమణీ అమ్మాళ్ అభిమానంతో, గభీమని తనకు ఇంత పెద్ద వయస్సులో కొడుకు ఉన్నాడనే విభ్రాంతిలో తృప్తితో , వాడిని చూసింది; వేణు చెయిలోని గోరులు పీకుతూ, తల వంచి, ఏదో ఆలోచిస్తున్నాడు.

ఇన్నిరోజుల తరువాత తన మనసుని నొప్పించే ఏదో ప్రశ్న గురించి వేణు తనతో చర్చించడానికి వచ్చాడని ఆ తల్లి సంతోషించింది.

కాని వాడి సంకోచం చూసి తనే సంభాషణ మొదలుపెట్టింది:

"ఏమిట్రా వేణు . . . నీకిక్కడ life bore కొట్టుతోందా?"

"హూం . . . " అని అంటూ తలెత్తి చూసిన వేణు " . . . Bore కొట్టుతోందని కాదు . . . నాకీ life ఏ మాత్రం నచ్చనే లేదు! ఏమైనా నేను moffussil type కదా? మీరందరూ నాగరికంగా - ultra నాగరికంగా - జీవిస్తున్నారు, అది నాకు

విరుద్ధంగా ఉంది . . . ” అని చెప్పి మళ్ళీ తల వొంచి అఱచెయిలో వేలుతో గీతలు గీయడం ఆరంభించాడు.

కొంచెం సేపు మౌనం వహించి రమణీ అమ్మాళ్ మాటాడింది:

“ . . . అసలు నీ తత్తరపాటు ఏమిటో నాకు అర్థం కావడం లేదు . . . ఇన్ని సంవత్సరాలూ మేం ఎలా జీవించామో, అలాగే మేం ఇప్పుడూ జీవిస్తున్నాం అని నాకనిపిస్తోంది . . . కొత్తగా ఏ ultra నాగరికతా ఇక్కడ రాలేదని నాకనిపిస్తోంది . . . నీ మనసులో ఏముందో స్పష్టంగా నువ్వు చెప్తే, నాకు బోధపడుతుంది . . . ” అని ఆమె అడిగినప్పుడు వేణు మనసులోని అలజడకి కారణమేమిటని ఆవిడకి ఆయాసం కలిగింది.

“అసలు ‘ఇక్కడకి ఎందుకురా వచ్చాం?” అని నాకనిపిస్తోంది . . . ఎవరో పరిచయం లేని వాళ్ళ ఇంటికి వచ్చినట్టుంది . . . మీ, ప్రేమా, అభిమానం నాకు పైకి మినుకుగా కనిపిస్తున్నాయి . . . మీరందరూ కపట జీవితం గడుపుతున్నారు . . . నేను తాతగారి ఇంటికి తిరిగి వెళ్ళిపోదామని ఆలోచిస్తున్నాను . . . ” అని వేణు అన్నమాటలు ఆమె ఓపికతో వింటోంది.

ఆ తరువాత ఇద్దరూ మౌనంగా ఉన్నారు. అప్పుడు మధ్యాహ్నం, సమయం పదకొండు గంటలు. ఇల్లంతా నిశబ్దంగా ఉంది; వంట గదిలో వంటమనిషి నిద్రపోతోంది. ఇంటిలోనూ, బయట వీదిలోనూ, ఎటువంటి సందడీ లేదు.

“వేణు . . . గభీమని నీకీ ప్రశ్న ఎలా వచ్చింది? తాతగారి ఇంటి జీవితంకి, మన పరిసరాలకి చాలా భేదం ఉందని నాకు తెలుసు . . . కాని, న్యాయంగా, నీ వయసుకి ఆ జీవితమే కదా bore కొట్టాలి? అభిరుచి అనే మాట వస్తే దానికి మూల కారణం మన అలవాటే కదా? ఐనా, ఇదేకదా నీ ఇల్లు? నీకిష్టం వచ్చినట్టు నువ్వు ఇక్కడ జీవించడానికి నిన్నెవరైనా ఆక్షేపించారా? ఎది ఎలాగున్నా ఇతరుల స్వతంత్రతలో జొరపడి, అధికారం చెలాయించే ధోరణి మన ఇంట్లో ఎవరికీ లేదు. నీకు గుర్తుందా? మీ తాతగారూ, నాయనమ్మా, ఇక్కడకి వచ్చి ఊరుకి బయలుదేరినప్పుడు నువ్వూ ‘వాళ్ళతో నేను వెళ్తాను!’ అని హఠం చేసావ్! . . . వాళ్ళకీ నిన్ను తీసుకువెళ్ళాలని ఆశ! . . . నీ ఆశకోసమే నేను నిన్ను వాళ్ళతో

పంపించాను . . . పిల్లల స్వతంత్రతకి ఈ ఇంటిలో అటువంటి మర్యాద ఎప్పుడూ ఉంది . . . మరి, నీకెందుకు బాధ? . . . వేణు, ఇక్కడ నీ స్వతంత్రతకి ఏమైనా అడ్డు ఉందా, చెప్పు . . . " అని ఆమె అడగ్గానే వేణు తల్లిని తేరిపాఱి చూసాడు.

"అంటే నీకు ఊరుకి తిరిగి వెళ్ళిపోవాలనిపిస్తే, అందుకు ఏదో కారణం ఉండాలి, అవునా?" అని రమణి అమ్మాళ్ లేతగా నవ్వుతూ అడిగింది.

"అవును, వేరే కారణం ఉంది . . . " అని చెప్పిన తరువాత తన మనసుని చిత్రవధ చేస్తున్న తన తండ్రి ప్రవర్తనగురించి నిజం ఆమెకు తెలియజేయడానికి మాటలు రాకుండా వేణు పెనుగులాడాడు.

"వేణు, అది మాత్రం కాదు. నువ్వు ఏమేమో అన్నావ్ . . . మా ప్రేమా, అభిమానం దగా, మాది కపట జీవితం అని అంటున్నావ్, అదేమిటో చెప్పు . . నీకెందుకు అలాంటి ఆలోచన వచ్చింది? అందరి జీవితంలోనూ పైకి మినుకుగా కనిపించే విషయాలు కొన్ని ఉంటాయి, నువ్వు దేనిగురించి మాటాడుతున్నావ్? నీ మనసు ఇంత లోతుగా నొచ్చుకుందన్నమాట! ఏం జరిగిందో చెప్పు . . . "

అప్పుడే వేణు తన చొక్కాయి జేబునుంచి ఒక రుమాలు తీసి తన ముక్కు, మొహం తుడుచుకున్నాడు. మొహమంతా ఎఱ్ఱబారిపోయింది.

"అమ్మా . . . నాకు నాన్నగారి ప్రవర్తన నచ్చలేదు," అని అంటూ ఆకాశాన్ని చూడడానికి వేణు మొహం మళ్ళించుకున్నాడు. తల్లి ఏమీ జవాబు చెప్పలేదు. ఆ ధైర్యంతో ఆమెను తిరిగి చూడకుండా మాట్లాడ సాగాడు.

"నీకూ, నాన్నగారికీ విరోధం వస్తుంది, నా వలన ఈ కుటుంబంలో శాంతి పాడవుతుంది అనే భయంతో నేనింతవరకూ కలవరపడుతూ రోజులు గడిపేసాను. కాని చెడిపోయే కుటుంబంలో శాంతి ఎన్నిరోజులు కొల్లపోకుండా ఉంటుంది? అమ్మా, అతను నీకు ద్రోహం చేస్తున్నారు . . . ఇది తెలిసిన తరువాత కూడా నేను దీన్ని నీదగ్గర దాచానంటే ఆ ద్రోహంకి నాకూ వాటా ఉందన్నమాట! అందువలనే ఈ అవమానకర కుటుంబంలో ఉండడానికి నాకు రోతగా ఉంది . . . నేనా అతన్ని సవరించగలను? సాధ్యమైతే నువ్వు అతన్ని సరిదిద్దు! అది మీ సొంత ప్రశ్న . . .

నేను వెళ్తాను . . . " అని చెప్పేసి అంతకు మించి తల్లి మొహం చూడడానికి ధైర్యం లేక వేణు అక్కడనుంచి పరుగెత్తాలని ఆతరతతో కనిపించాడు.

వాడికి మనసులో - 'తల్లి ఏడుస్తుందేమో? ఏడుస్తూనే అతని గురించి తన్ను ఏమైనా వదరుబోతు మాటలు అడుగుతుందేమో? పట్టరాని కోపంతో తనకి ద్రోహం చేసిన భర్తని తిట్టి, శపించుతుందేమో? ఇంతకాలమూ అనుమానంతో మనసులో తను దాచుకున్న సంగతి ఇప్పుడు కొడుకు వరకూ తెలిసిపోయిందని అవమానంతో అల్లాడుతుందేమో? - అనే భయంతో, ఒక నేరస్తుడు లాగ ఆమె దగ్గరనుంచి తప్పించుకొని పారిపోలాలని ఉంది.

కాని "వేణు!" అని నిమ్మళంగా, ఆవేశం వలన శ్రమ పడుతున్న కంఠధ్వనితో అతని తల్లి పిలుపు విని వాడు కదల్లేదు.

ఆమె మొహంలో తను ఎదురుచూసిన జాడ ఏదీ కనిపించలేదు. ఆమె అనురాగంతో "రా, ఇలా వచ్చి కూర్చో" అని అనగానే వేణు కుర్చీనుంచి లేచినవాడు మళ్ళీ కూర్చున్నాడు.

"నువ్వేమో నీ వ్యక్తిగత ప్రశ్నగురించి ఏదో చెప్తావనుకున్నాను . . . ఇంతకీ ఇది మీ నాన్నగారి ప్రశ్న అన్నమాట! బాగుంది . . . " అని ఆవిడ నవ్వింది.

"అంటే ఇంతకు ముందే నీకు దీనిగురించి తెలుసా?" అని సణుగుతున్నట్టు వేణు అడిగాడు.

"వేణు, అవన్నీ తెలుసుకోవాలని నాకు ఇష్టం లేదు . . . " అని ఆమె అన్న మాటల్లో ఒక గంభీరత కనిపించింది.

ఆవిడ ఇంకా చెప్పింది:

"ఇదిగో, విను . . . అతను నీకు తండ్రి, నాకు భర్త . . . ఆ బంధం ఎంత నిజమో, అదే విధంగా అతనొక ప్రొఫెసరు, ఒక విద్యావంతుడు; ఈ సమాజంలో అతనికి అంతస్తు, గౌరవం, ఉన్నాయి . . . అవునా?"

వేణు మరేం అనక ఊరుకున్నాడు.

ఆవిడే మళ్ళీ మాటాడింది:

"అతని గురించి నువ్వు గర్వపడడానికి ఎన్నో కారణాలున్నాయి. కాని నువ్వేమో అవన్నీ వదిలేసి - దేనిగురించి నీకు పూర్తిగా ఏమీ తెలియదో, ఎది అతని అంతరంగ విషయమో - దాన్ని సూక్ష్మంగా చూసి అవమాన పడుతున్నావ్! ఆదేనా నీకు కావాలి? . . . "

వేణుకి పట్టరాని కోపం వచ్చేసింది. "అమ్మా, నేను అన్నీ పూర్తిగా తెలుసుకునే మాటాడుతున్నాను . . . I have proof! I can prove it! . . . అతను ఫోనులో మాట్లాడినది నేను నా చెవుల్లో విన్నాను . . . అందువలనే ఆ రాత్రి సినిమా theatre కి వెళ్ళి ఈ కళ్ళతో చూసాను . . . అతని గదిలో ఉన్న డ్రాయరులో ఒక ప్రేమ లేఖ ఉందే, దాన్ని నేను అతని మొహంలో విసిరినప్పుడు అతనే కాదని అనలేదే?"

"Oh! It's a shame on you! Proof ఉందట, proof! పేరు మోసిన మనుషులని, ప్రసిద్ధమైన పెద్దలని అపనింద చెయ్యడానికనే కొన్ని అశ్లీల పత్రికలున్నాయిగా, వాళ్ళ దగ్గరా proof ఉంది! గౌరవనీయలు ఎందుకు వాటిని నిరాకరిస్తారు? ఒక వ్యక్తికున్న ప్రతిష్ట, యోగ్యత - ఇవన్నీ వదిలేసి అతని అంతరంగ బలహీనతలగురింటే మాటాడమే వాళ్ళకి లక్ష్యంగా ఐపోయింది! అందువలన సమాజంకి, నాగరికతకి, ఏం లాభం, చెప్పు? అందువలనే మనకి ఆ పత్రికలని చూస్తేనే జుగుప్స . . . ఇప్పుడు నువ్వు చేసిన పనికీ, దానికీ, ఏం భేదం చెప్పు . . . నువ్వూ వాళ్ళలాగే proof ఉందని అంటున్నావ్! I feel very sorry for you . . . What a shame! . . . It's a shame on you!" అని అంటూ రమణి అమ్మాళ్ తన రెండు చెవులని మూసుకుంది.

"నువ్వు నిజంగానే ఇవన్నీ చేసావా? . . . వేణు, అతను ఎంత పెద్దవారు . . . అతన్ని నువ్వు ఇంత నీచంగా . . . " ఆ మాటలు అంటూంటే ఆమె దేహమూ, మనసూ, అల్లాడిపోయాయి.

'ఇదేం మనిషి? ఇదేం భార్య?" అని బోధపడక వేణు నివ్వెరపడిపోయాడు.

"అమ్మా, నీ మంచికోసం, ఈ కుటుంబ గౌరవం కోసం - నేను చేసేది పొరబాటు అని తెలిసే- అతన్ని సరిదిద్దాలని అలాగ చేసాను" అని వేణు ఆమెను ఓదార్చాలని ప్రయత్నించాడు.

"వేణు, I feel sorry for you . . . అతని గురించి కాదు . . . నీ గురించి . . . నువ్వు చేసినది ఎంత పెద్ద పొరబాటు! ఒక తండ్రితో అతని కొడుకు . . . అయ్యో, నేను నమ్మలేకున్నాను! . . . "

"అతను నీకు ద్రోహం చేస్తున్నారు అని తెలిసి కూడానా . . . "

"That's my problem!" అని ఆమె జోక్యం చేసుకుంది. "అది మా సొంత ప్రశ్న! మా దాంపత్యంలో - అంతరంగంలో - జొరపడడానికి నీకేం హక్కు ఉంది?" అని అడిగినప్పుడు ఆమె దేహమంతా వొణికింది.

"చెప్తాను, విను . . . మేం ఇరవైఐదు సంవత్సరాలు నెమ్మదిగా కాపురం చేస్తున్నాం - అది ఆఖరివరకూ అలాగే సాగుతుంది . . . అందువలనే ఆ శాంతిని, సంతోషంని పాడుచేసేది ఏదైనా సరే, అందులో నేను జోక్యం చేసుకోవడం నాకు ఇష్టం లేదు . . . నాకూ కొంచెం తెలుసు, ఐతేనేం? అతనికి నన్ను మించిన సహకారి మరెవరూ లేరు . . . నువ్వు చెప్పావుగా - దానిగురించి నాకూ మనసులో కొంచెం దుఃఖం ఉంది." ఈ మాటలు పలికినప్పుడు - ఎంత ప్రయత్నించినా, ఆమె హృదయంలో గడ్డ కట్టుకొనివున్న శోకం - మెల్లగా కరిగే సూచనలు కనిపించాయి. కళ్ళద్దాలని తీసి, ధారధారగా కారుతున్న కన్నీళ్ళని తుడిచి, లేచి, వరాండాలో కొంచెం సేపు నిలబడి, తన్ను స్థిరపరచుకొని, ఆమె మళ్ళీ వేణుకి ఎదుట వచ్చి కూర్చుంది.

"వేణు, నువ్వు అనుకున్నట్టు జీవితమనేది అంత సులభంగా మనకి బోధపడదు. అందులో చాలా ఘర్షణలు, చిక్కులున్నాయి. వాటిమధ్య ఒక కుటుంబంని నిమ్మళంగా నడపాలి; అది ఒక కళ. ఒర్పు, సహనం, లేకపోతే - ప్రేమకి, మమకారంకి అర్థమే లేదు. నీలాగ నేను చేసాననుకో . . . ఈ కుటుంబంలో శాంతి, అతని గౌరవం పాడవడానికి నేనే కారణమైవుంటాను. నా possessiveness కోసం నా స్వాధీనంలో అతను ఉండాలని ఈ కుటుంబంలో శాంతి, అతని గౌరవం,

నా పిల్లల భవిష్యత్తు తాకట్టు పెట్టడానికి పూనుకుంటే, నా స్వార్థం ఎంత నీచం! . . . ఇలాగ అనడం వలన నేనేమో రహస్యంగా శోకం అనుభవిస్తూ నా రోజులు గడుపుతున్నానని కల్పించుకోవద్దు! కాని మనసులోనూ రవంత శోకం లేకపోలేదు; పూర్తిగా సంతోషం కావాలంటే అదేం అంత సులభంగా సాధ్యం కాదుగదా?. .

"ఇక్కడ నాకు నోరు తెరిచి మాటాడానికి హక్కు ఉందా, లేదా అనే ప్రశ్న లేదు. 'అందువలన ఏమిటి ఫలం?' అని ఆలోచించవద్దా? 'మనకేం నష్టం?' అని నేను ఆలోచించి చూసాను. వేణు, నేను దానిగురించి మాటాడకపోవడం 'ఒక సభ్యత' అని తెలుసుకో . . . అవును, ఒకరిని మనం గౌరవిస్తున్నాం అంటే ఏమిటి అర్థం? అతని అంతరంగం - privacy - తెలుసుకోవాలని మనం బలవంతంగా ప్రయత్నించకుండా ఉండడమే! ఇంకొకరిమీద ప్రేమానురాగాలు చూపడమంటే - అతని అంతరంగంలో ఒక బలహీనత ఉందని మనకి తెలిసినా, అతనిలో ఉన్న ఇతర అర్హతలు, హక్కులు, అతని గౌరవంని ఏ మాత్రం తక్కువ చెయ్యలేదని, ఆ లోపమూ అందులో ఉందని గ్రహించడమే.

"అవును, ఒకరి అంతరంగం ఎంత పవిత్రమైనది! Venu, it's something sacred! ఇందులో రెండవ మనిషి జొరపడడం - అది ఎవరైనా సరే - అనాగరికమైన పని!"

"అమ్మా, నువ్వు అతని భార్య కాదా?

"So, what? ఆ హక్కుని నేను దుర్వినియోగం చేస్తే ఆ హక్కుని వెనక్కి తీసుకోడం సాధ్యం కదా?"

"నీ విషయంలో అతనలా ఉంటారా?"

"'ఉంటారా?' అని అడుగుతున్నావా? వేణు, అతను ఉన్నారు. ఒక భర్త తన భార్యని, లేక ఒక భార్య తన భర్తని, అనుమానించి అంతరంగంలో విషయాలన్నీ హద్దు మీరి పరీక్షించి చూడడానికి ఎటువంటి కారణమూ లేదు. ఒకే ఒక కారణముంది: వాళ్ళు తమకి ఆ హక్కు ఉందని నమ్ముతున్నారు . . .

“భర్త-భార్యా-కొడుకు-తల్లి-తండ్రి - వీళ్ళందరూ ఒక బంధుత్వంకి లోబడినవారే - కాని ప్రతి ఒక్కరూ ఒక separate individual unit, అవునా? ఒక్కక్క జీవికి ఒక అపూర్వమైన అంతరంగం ఉంది. వేణు, దాన్ని మనం గౌరవించాలి! ఒకరిమీద గణ్యత చూపాలంటే మనం వాళ్ళ అంతరంగంకి -చాలా జాగ్రత్తగా - మర్యాద చూపాలి . . . నీ నాన్నగారు గురించి నీ మనసులో ఏమనుకున్నావ్? నువ్వు అతన్ని అడిగినట్టు నేనతన్ని అడగ్గలనా? అలా ఊహించడమే నావల్లకాదు! . . . అబ్బా, నువ్వెంత పని చేసావ్! . . .

“. . . మీ నాన్నగారు చాలా strong man . . . అతనిది తప్పకుండా భరించగలరు . . . అతనికి తన బలహీనతలు దాటే త్రాణ ఉంది . . . వేణు, జీవితమనేది చాలా చిక్కైనది . . . దానిగురించి మనం బాగా తెలుసుకోవాలి . . . ఈ పుస్తకం చదివిచూడు . . . ఇటువంటి భావనలు విశాలమైన దృక్పథంకి దోహదం చేస్తాయి.”

వేణుకి అంతా తారుమారుగా ఉంది. వాడి మనసులో తాతగారు, నాయనమ్మ మాత్రం ఆదర్శ దంపతులుగా కనిపించారు.

** ** **

కొన్నిరోజుల తరువాత ఒక సాయంత్రం సుందరం కాలేజీనుంచి వచ్చి దుస్తులు మార్చుకొనే సమయం, రెండు రోజుల ముందు ఎవరికీ చెప్పకుండా ఇంటినుంచి పారిపోయిన వేణు రాసిన ఉత్తరం రమణి అమ్మాళ్ అతనికి ఇచ్చింది.

అందులో ముఖ్యమైన ఆఖరి వాక్యాలు ఇవి:

“నాకు తాతగారి మనవడుగా ఉండడానికే అర్హత ఉంది. వచ్చేసాను. మీ జీవిత నియమాలు తెలియక నేను పొరబాటు చేసివుంటే నన్ను క్షమించండి.”

- వేణు

ఉత్తరం చదివిన తరువాత ఇద్దరూ ఒకరినొకరు అర్థపుష్టితో చూసుకున్నారు.

“మార్పుని ఎదిరించేవారు డెబ్బైయేళ్ల వయస్సుకు పైగా ఉండాలనే నియమం లేదు. . . . ఇరవై ఏళ్ల వయస్సులోనూ ఉండవచ్చు . . . ” అని చెప్పి సుందరం నవ్వారు.

రమణి అమ్మాళ్ కొంచెం సేపు వేదనతో రెప్ప వాల్చకుండా అతన్ని  చూసింది. కళ్ళు ఎఱ్ఱబారి మకమకలాడాయి.

ఆమె అగాధమైన తన దుఃఖంని ఒక చిరునవ్వుగా మార్చుకొని అతన్ని అడిగింది: ‘‘ఇప్పుడు కూడా . . . మీరు . . . మీరు . . . ’’ వొణుకుతున్న ఆమె పెదిమలు తన బుగ్గలో అదుముకున్నట్టు సుందరం ఆమెను కౌగిలించుకున్నారు.

- ఆ తరువాత జరిగివన్నీ వాళ్ళ అంతరంగ వ్యవహారాలు!

********